క్లుప్తంగా

కౌన్సిల్ సమావేశంలో నాలుగు తీర్మానాలు



మాట్లాడుతున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో నాలుగు అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ సిబ్బందికి యూనిఫాంల కొనుగోలుకు రూ.లక్ష ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. దశాబ్ది ఉత్సవాలకుగాను అయినటువంటి ఖర్చు రూ.3లక్షల 71వేలు సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్‌చైర్మన్ సాగర్ రెడ్డి, మేనేజర్ నాగరాజు,ఆర్‌వో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టచ్ ఆసుపత్రిలో గుండె వైద్య సేవలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో గల టచ్ ఆసుపత్రిలో గుండె సంబంధిత వైద్య సేవలను ఉమ్మడి జిల్లాలోనే ప్రప్రథమంగా అనతి కాలంలోనే ప్రారంభించినట్లు టచ్ ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. వారు మాట్లాడుతూ గురువారం మొట్టమొదటి సారిగా మంచిర్యాలలో పీటీసీఏ అనగా స్టంట్ వేయడం జరిగిందన్నారు. మహానగరాల్లో అమర్చే ఎమ్మారై కంపాటబుల్ పేస్ మేకర్‌ని తమ ఆసుపత్రిలో అమర్చడం జరిగిందని, ఇది గుండెను లయబద్ధంగా కొట్టుకోవడానికి సాయపడుతుందన్నారు. ఇలాంటి గొప్ప సేవలు మన పట్టణంలో దొరకడం చాలా గొప్ప విషయమన్నారు. అన్ని రకాల గుండె సంబంధిత వ్యాధులకు, అన్ని రకాల ఎమర్జెన్సీలలో ప్రసూతి సేవలలో, ఆర్థో సర్జరీలలో, యూరాలజీ సర్జరీలలో మెరుగైన ట్రీట్‌మెంట్, కార్డియాక్ హై రిస్క్ చికిత్సల కోసం టచ్ ఆసుపత్రిలో సంప్రదించాలని ఆయన కోరారు.

ట్రాక్టర్లు సీజ్

జన్నారం: పొనకల్ ఊర చెరువులో మొరం పోస్తున్న నాలుగు ట్రాక్టర్లను తహసీల్దార్ ఇట్యాల కిషన్ సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. తహసీల్దార్ కథనం ప్రకారం.. మండలంలోని పొనకల్ ఊర చెరువులో మొరం పోయిస్తూ కబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి మొరంతో పాటు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెంటనే ఇరిగేషన్ అధికారులకు తెలిపి చెరువు బౌండరీ ఫిల్లర్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు.

వినతిపత్రాలు అందజేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి అమ్మాగార్డెన్స్ ఏరియాలో డ్రైయినేజీలు నిర్మించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు వినతిపత్రం అందించారు. అలాగే రామాలయం ఏరియాలో గల అమర వీరుల స్తూపం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేయాలని రామాలయం యూత్ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిని అందించారు.

పాత భవనాల్లో పాలన..!



చెన్నూర్ మున్సిపాలిటీ భవనం

- మున్సిపాలిటీలుగా మారినా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే నిర్వహణ
- 2018లో చెన్నూర్, క్యాతన్‌పల్లి, నస్పూర్, లక్సెట్టిపేట బల్దియాల ఏర్పాటు
- ఐదేళ్లవుతున్నా కొత్త భవనాలకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- ఇరుకు గదులు, అరకొర వసతులతో సిబ్బంది, ప్రజల అవస్థలు



ఇరుకుగా ఉన్న పౌరసేవా కేంద్రం

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం పాలనపరమైన సౌలభ్యం కోసం 2018లో జిల్లాలోని చెన్నూర్, క్యాతన్‌పల్లి, నస్పూర్, లక్సెట్టిపేట నాలుగు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీగా ఏర్పాటై ఐదేళ్లు కావస్తున్నా, నేటికి పాత గ్రామ పంచాయతీ భవనాల్లోనే కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. మున్సిపాలిటీల ఏర్పాటుతో పురపాలికల్లో సిబ్బందితో పాటు అధికార యంత్రాంగం రెండింతలు పెరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన బల్దియాల్లో ఆదాయం పెరగడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయి. సొంత భవనాల నిర్మాణాలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అరకొర వసతుల మధ్య..

అప్పటి గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందికి సరిపడే విధంగా గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించారు. గ్రామ పంచాయతీ భవనాల్లోనే మున్సిపాలిటీని ఏర్పాటు చేయడంతో అధికారులు, సిబ్బందితో పాటు మున్సిపాలిటీలకు వివిధ పనులపై వచ్చే ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో కమిషనర్‌తో పాటు చైర్మన్ చాంబర్, కౌన్సిల్ మందిర్, వీడియో కాన్ఫరేషన్ హాల్, సెక్షన్ హెడ్, కంప్యూటర్ గది, శానిటరీ విభాగం, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాలు 14గదులు అవసరం ఉంటుంది. వీటితో పాటు చెత్త వాహనాలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసేందుకు పార్కింగ్ స్థలం అవసరం ఉంటుంది. పాత గ్రామ పంచాయతీల్లో కేవలం రెండు నుంచి మూడు గదులు ఉండడంతో అధికారులు, సిబ్బంది అరకొర వసతుల మధ్య విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. కార్యాలయాల్లో గదుల కొరత ఉండడడంతో, పూర్తి స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండడంలేదని ఆయా మున్సిపాలిటీల ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం ప్రతిపాదనలు అడగలేదు



మున్సిపాలిటీలకు ప్రత్యేక భవనాలు అవసరమే. వివిధ శాఖలతో పాటు సిబ్బంది సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కౌన్సిల్ సమావేశ మందిర్‌తో పాటు చైర్మన్ చాంబర్, వీడియో కాన్ఫరేషన్ హాళ్లకు ప్రత్యేక గదులు అవసరం ఉంటుంది. వాహనాలు పార్క్ చేసేందుకు స్థలం అవసరం ఉంటుంది. చెన్నూర్ మున్సిపాలిటీలో స్థలం ఉంది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ప్రతిపాదనలు పంపించాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల పరిస్థితి ఇలా..

- చెన్నూర్ మున్సిపాలిటీ పాత గ్రామ పంచాయతీ భవనంలోనే పురపాలక సేవలను అందిస్తున్నారు. కొత్త భవన నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. పాత భవనం స్థానంలోనే కొత్త భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని అధికారులు అంటున్నారు.
- నస్పూర్ మున్సిపాలిటీ పాత గ్రామ పంచాయతీ భవనంలోనే కొనసాగుతుంది. మున్సిపాలిటీ భవన నిర్మాణం కోసం సర్వే నెంబర్ 42లో 1.20ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నేటికీ నిధులు మంజూరు కాలేదు.
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పాటు చేసి నాలుగేళ్లకు పైగా అవుతుంది. నేటికీ పాత గ్రామ పంచాయతీలోనే మున్సిపాలిటీ కొనసాగుతోంది. ఇప్పటికి స్థలం కేటాయింపు జరగలేదు. నిధులు మంజూరు కాలేదు.
- లక్సెట్టిపేటలో గ్రామ పంచాయతీ భవనంలోనే మున్సిపాలిటీ కార్యకలపాలు సాగుతున్నాయి. ఇప్పటికీ స్థల కేటాయింపు లేదు. నిధులు సైతం మంజూరు కాలేదు.

జిల్లా కేంద్రంలో 'ఇంటింటికీ బీజేపీ'



పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు రాష్ట్రంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ప్రతి బూతులో గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి పల్లా గంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో జాతీయ రహదారులు, అమృత్ భారత్ పథకం ద్వారా రైల్వే స్టేషన్, జిల్లాకి మెడికల్ కాలేజీ కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించినట్లు తెలిపారు. ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, చిరు వ్యాపారులకు ముద్రలోన్ ద్వారా పేద ప్రజలు లబ్ధిపొందారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీశ్ జైన్, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, బూత్ అధ్యక్షుడు ఆడెపు దీపక్ సాయి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి రాజాబాబు, ఆకుల అశోక్ వర్దన్, పట్టి వెంకటకృష్ణ, శ్రీదేవి, మల్లిఖార్జున్, మాదాం మల్లేశ్ పాల్గొన్నారు.

తాగునీటిని అందించాలి

నెన్నెల: మంచినీళ్ల లేక నందులపల్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి నీళ్లు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ బాధ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నందులపల్లిలో గురువారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు.

ఫూలే విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతివ్వాలి

పాతమంచిర్యాల: బెల్లంపల్లి చౌరస్తాలో మహాత్మా జ్యోతిభాఫూలే విగ్రహ ప్రతిష్టాపనకు అనమతివ్వాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పాలక వర్గంతో చర్చించి, ఎజెండాలో చేర్చి, ఫూలే విగ్రహ ప్రతిష్టాపనకు కలెక్టర్‌కు సిఫారసు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి బొనలిశెట్టి లక్ష్మణ్, కార్యదర్శి వెన్నంపల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

శ్రీరాంపూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ సెక్యూరిటీ (ఎస్అండ్‌పీసీ) అధికారి మురళి మోహన్ తెలిపారు. శ్రీరాంపూర్ ఎస్అండ్‌పీసీ కార్యాలయం వద్ద గురువారం యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో కలిసి ఆయన యోగా చేశారు. యోగా భారతదేశంలో పుట్టిందని, నేడు ప్రపంచవ్యాప్తమైందన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న యోగాను మన ముందు తరాల వరకు కూడా అందించాలన్నారు. యోగా దైనందిక జీవితంలో కూడా భాగంగా చేసుకోవాలన్నారు. యోగా గురువు గొప్ప లక్ష్మణ్ సిబ్బందితో యోగాసనాలను వేయించారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్స్‌స్పెక్టర్ అజీముద్దీన్, జూనియర్ ఇన్స్‌స్పెక్టర్ రాజయ్య, జమ్మేదారులు కనకయ్య సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సెక్యూరిటీ అధికారి మురళీమోహన్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లిలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/చెన్నూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ నిధులను వెచ్చిస్తూ, పార్టీ ప్రచార కార్యక్రమాలను చేపట్టడాన్ని నిరసిస్తూ మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను తగలబెట్టారు. చెన్నూర్ పట్టణంలో రెండు వర్గాలు వేరువేరుగా కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకురాలు రామిండ్ల రాధిక, దాసరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతాప్ మారుతీ మందిర్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కేసీఆర్ దిష్టిబొమ్మను శవయాత్ర నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. కొత్త బస్టాండ్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి వెడమ బొజ్జు, పీసీసీ సభ్యులు నూకల రమేశ్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, పీసీసీ సభ్యులు కొండ చంద్రశేఖర్, మందమర్రిలో టీపీసీసీ అనుబంధ డాక్టర్స్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ దాసారపు శ్రీనివాస్, బెల్లంపల్లిలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ...

మంచిర్యాలటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటుంటే, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అభివృద్ధి పథంలో దూసుకుపోతుండగా, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం ఎలాంటి అభివృద్ధి లేదని అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, వార్డు కౌన్సిలర్లు గాదె సత్యం, హరికృష్ణ, అంకం నరేశ్, సురేశ్ బల్దువా, పోరెడ్డి రాజు, ప్రకాశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లికి ఉత్తమ పురస్కారం

నెన్నెల: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అవార్డు ప్రశంసాపత్రాన్ని నెన్నెల మండలంలోని గొల్లపల్లి సర్పంచ్ ఇందూరి శశికళకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధికారులతో కలిసి అందజేశారు. జాతీయ స్థాయిలో సామాజిక భద్రత విభాగంలో గొల్లపల్లి ఎంపికకాగా కేంద్రం నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి ప్రశంసాపత్రాన్ని పంపించారు. జాతీయ పురస్కారం మరింత బాధ్యత పెంచిందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

'నవోదయ'కు ఎంపిక

జన్నారం: మండలంలోని స్లేట్ హైస్కూల్, రాఘవేంద్ర లిటిల్ హార్ట్స్ పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. స్లేట్ హైస్కూల్‌కు చెందిన కామెర సాక్షిత్, జాడి మణివన్నన్, శ్రీ రామోజు సాకెత్, సీదర్ల అక్షర, స్నేహితలు, రాఘవేంద్ర పాఠశాల నుంచి గూడ శ్రీహితలు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా రాఘవేంద్ర పాఠశాలలో ఎంపికైన విద్యార్థిని జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అభినందించారు.

నేడు వేంపల్లిలో వరల్డ్ హ్యాండ్‌బాల్ డే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి పద్మావతి గార్డెన్స్‌లో శుక్రవారం వరల్డ్ హ్యాండ్‌బాల్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ఒలంపిక్ అసోసియేషన్‌తో పాటు జిల్లాలోని అన్ని క్రీడా సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పేట సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, క్రీడాకారులు హాజరుకావాలని కోరారు.

నేడు గఢ్‌పూర్‌లో విగ్రహ ప్రతిష్ఠ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్‌లో పోచమ్మతల్లి, పోతరాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతుండగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నారు. గురువారం చండీయాగం, కుంకుమార్చన పూజా, శోభాయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొని దర్శనం చేసుకున్నారు.

లైబ్రేరియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

తాండూర్: బెల్లంపల్లి ఏరియా మాదారంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ పోస్టు కోసం అర్హత కలిగిన వ్యక్తులు, దరఖాస్తు చేసుకోవాలని ఏరియా సింగరేణి పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో లైబ్రరీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు, ఫొటోతో మాదారం పరిసర ప్రాంతాల యువతీ, యువకులు ఈ నెల 29వ తేదీ వరకు గోలేటి జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల మంచిర్యాలలో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఫిజిక్స్ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రజని తెలిపారు. ఎంఎస్సీ(ఫిజిక్స్) బీఈడీ అర్హత కల్గిన విద్యార్థులు ఈ నెల 23, 24తేదీల్లో సంప్రదించాలన్నారు. 9 నుంచి 12వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుందన్నారు.

28సార్లు రక్తదానం

దండేపల్లి: మండలానికి చెందిన నటరత్న యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మన మహేష్ 28సార్లు రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచాడు. దండేపల్లికి చెందిన భైరి లచ్చవ్వ గురువారం అనారోగ్యంతో మంచిర్యాల ఆసుపత్రిలో చేరగా చికిత్స నిమిత్తం రక్తం అవసరమని చెప్పడంతో, మహేష్ ముందుకు వచ్చి ఆమెకు రక్తదానం చేశాడు.



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు



లక్సెట్టిపేట: మౌనం పాటిస్తున్న అధికారులు



చెన్నూర్ మున్సిపాలిటీ ఆవరణలో...



బెల్లంపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

అమర వీరులకు ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా ఉద్యమంలో అమరులైన వీరులకు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో, పలు పార్టీల ఆధ్వర్యంలో పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరులను స్మరించుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో, మున్సిపాలిటీ కార్యాలయాల్లో అమరుల సంస్మరణ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేక సమావేశంలో ఎలాంటి అభివృద్ధి పనుల తీర్మానాలు చేయకుండా, అమరుల సంస్మరణ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థి, యువజనుల ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, అమరుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో అమరులను ఎన్నటికీ యాది మరువబోమని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ప్రార్థన సమయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో అమరవీరుల చిత్రపటాల వద్ద అమరుల కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. భీమారం మండలంలోని ఎలకేశ్వరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రంగురంగుల ముగ్గులు వేసి, పూలతో అలంకరించి అమరులకు నివాళులర్పించడం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జన్నారం: నివాళులర్పిస్తున్న సభ్యులు



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



వేమనపల్లి: పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తాండూర్: శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్



నస్పూర్: నివాళులర్పిస్తున్న చైర్మన్, సిబ్బంది



దండేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో...



చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో...



మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయంలో...



భీమారం: ఎలకేశ్వరంలో...

సంక్షిప్త వార్తలు

సాదాసీదాగా మండల సమావేశాలు

భీమిని/బెల్లంపల్లిరూరల్: కన్నెపల్లి, బెల్లంపల్లి మండల సమావేశాలు గురువారం సాదాసీదాగా సాగాయి. అధికారులు తమతమ నివేదికలు చదివి మమా అనిపించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు పూర్తి అయినప్పటికీ డబ్బులు రాలేదని రెండు మండలాల్లో సభ్యులు ప్రశ్నించారు. త్వరలోనే బిల్లులు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. బెల్లంపల్లిలోని కన్నాల గ్రామ పంచాయితీ శివారులో సర్వే నంబర్ 60లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా, అక్రమ ఇంటి నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు.

కుక్కల బెడద నివారించాలి

తాండూర్: మండలంలోని మాదారం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కోతులు, కుక్కల బెడదను నివారించాలని గురువారం నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

పోచమ్మ బోనాలు

లక్సెట్టిపేట/దండేపల్లి: లక్సెట్టిపేట మండలంలోని జెండావెంకటాపూర్‌లో, దండేపల్లి మండలంలోని నెల్కి వెంకటాపూర్‌లో గురువారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణ పరిధిలో గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నస్పూర్ మండల అధ్యక్షుడు బండి సత్యనారాయణ, కార్యదర్శి ఈదునూరి అభినవ్ డిమాండ్ చేశారు. డాన్ పబ్లిక్ స్కూల్ ఎదుట గురువారం నిరసన తెలిపారు.

సంతాపం

వేమనపల్లి: ఇటీవల పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌రావు మృతి చెందగా ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సంతాపం తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.